క్లుప్తంగా

వధూవరులను ఆశీర్వదించిన మాజీ సీఎం వైఎస్ జగన్



నూతన వధూవరులతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వేంపల్లె : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేంపల్లెలోని ఓ వివాహ వేడుకలో పాల్గొన్నారు. మంగళవారం వేముల మండలం వి.కొత్తపల్లె గ్రామానికి చెందిన వెన్నపూస వెంకట్రామిరెడ్డి కుమారుడి వివాహం మంగళవారం స్థానిక ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపంలో జరిగింది. పురుషోత్తమరెడ్డి, సాహితీరెడ్డిలను వైఎస్ జగన్ ఆశీర్వదించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, వేముల మండల కన్వీనర్ సాంబశివరెడ్డి, మైనార్టీ నాయకులు మునీర్, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు



నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం నియోజకవర్గంలోని క్రైస్తవ సోదర సోదరీమణులు క్రిస్మస్ పండుగను కుటుంబ సభ్యులు, సన్నిహితులు, బంధువులతో కలసి సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



చిన్నరంగాపురంలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ నాగలక్ష్మి

పులివెందుల రూరల్ : సస్యరక్షణ చర్యలు చేపడితే వేరుశనగ పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారిణి నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని చిన్నరంగాపురం గ్రామంలో ఆహారం, పోషకాల భద్రత, పంట నూనెలు, నూనెగింజలు, జాతీయ యంత్రం అనే కార్యక్రమం నిర్వహించారు. రైతు సాంబశివారెడ్డి సాగు చేసిన వేరుశనగ పంటను ఏఓ పరిశీలించి పంటలో చీడపీడలు, రసం పీల్చే పురుగులను గుర్తించారు. వీటి నివారణకు పసుపు పచ్చ పల్లాలు ఎకరానికి 25 చొప్పున పెట్టుకోవాలని, రసంపీల్చే పురుగుల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సురేష్, రైతులు పాల్గొన్నారు.

సమాచారాన్ని సరిదిద్దిన పోలీసులు



అప్పిలేట్ అధికారి పేరును సూచిస్తూ సమాచార హక్కు చట్టం బోర్డు

ముద్దనూరు : స్థానిక అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో సమాచార హక్కు చట్టం బోర్డును పోలీసులు సరిదిద్దారు. రెండు రోజులక్రితం సాక్షి దినపత్రికలో 'సమాచారం'లో పోలీసుల నిర్లక్ష్యం అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన పోలీసు శాఖ సమాచార హక్కు చట్టం బోర్డులో అప్పిలేట్ అధికారి పేరును మార్పుచేశారు. గతంలో డీఎస్పీ యశ్వంత్ పేరు వున్న బోర్డులో ప్రస్తుతం అప్పిలేట్ అధికారిగా వున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు పేరును పొందుపరుస్తూ సమాచార బోర్డులో లోపాన్ని సరిదిద్దారు.

శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీసీతారామ, ఆంజనేయస్వామి మూలవిరాట్

వేంపల్లె : కత్తులూరు గ్రామ పంచాయతీ తాటిమాకులపల్లెలో ఉన్న శ్రీరాముని ఆలయంలో మంగళవారం మండలం పూజ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం నాటితో ఆలయం నిర్మించి 41రోజు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సీతారాముల అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి హోమాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సీతారాముల అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు మాజీ సర్పంచ్ ఆర్ఎల్వీ ప్రసాద్ రెడ్డి, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల ధరలకు రెక్కలు

- ఎరువుల బస్తాపై రూ.100 నుంచి రూ.200 వరకు పెంపు
- పెరిగిన ధరలతో అన్నదాతల ఇబ్బందులు



సింహాద్రిపురంలో సాగు చేసిన అరటి పంట



రైతులు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్న ఎరువులు

సింహాద్రిపురం : ప్రస్తుత పరిస్థితుల్లో పంటల సాగు భారంగా మారింది. అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారుతోంది. సేద్యపు ఖర్చులే భారంగా మారిన నేపథ్యంలో ఎరువుల ధరలకు రెక్కలు రావడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఇప్పటికీ ఏటా ప్రభుత్వం అందజేసే పెట్టుబడి సాయం ఆటకెక్కింది. ఏకంగా రూ.20 వేలు అందజేస్తామన్న కూటమి ప్రభుత్వ పెద్దలు ఊసే ఎత్తడం లేదు. దీంతో అన్నదాతలు నిరాశకు గురవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడులు తగ్గాయి, అరకొర దిగుబడులకు సైతం గిట్టుబాటు ధరలు లేక దిగాలు పడుతున్న పుడమి పుత్రులకు ఎరువుల ధరల పెరుగుదల నెత్తిన పిడుగు పడినట్లయ్యింది. కష్టాలకు ఎదురీదుతూ ఈ ఏడాది రబీసీజన్‌లో రైతులు పంటలు సాగు చేశారు. రబీ సీజన్ కింద మండలంలో రైతులు బుడ్డశనగ, మినుము, జొన్న, వేరుశనగ తదితర పంటలను వేల ఎకరాలలో సాగు చేశారు. రైతులు ఎక్కువగా వినియోగించే కాంప్లెక్స్ ఎరువులు భారంగా మారాయి. ఒక్కో రకం ఎరువుల బస్తాపై రూ.100 నుంచి రూ. 200 వరకు పెరిగాయి. దీంతో ఎరువులను కొనాలంటే రైతులకు భారంగా మారింది.

అవసరం ఎక్కువ.. వినియోగం తక్కువ

ఏ పంటకైనా సమతుల్యంగా ఎరువులు వేస్తేనే ఆశించిన దిగుబడులు వస్తాయి. ధరలు పెరగడంతో నత్రజని అందించే యూరియాలో అధిక మోతాదు డీఎస్, ఎండస్ వంటి కాంప్లెక్స్ ఎరువులను బాగా తగ్గించేస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలోని వరి పంటకు డీఏపీ ఎరువులు 52 కిలోలు వేయాల్సి ఉండగా.. 25కిలోలు వినియోగిస్తున్నారు. యూరియా 75 కిలోలకు గానూ 150 కిలోల వరకు వినియోగిస్తున్నారు. యూరియా ధర తక్కువగా ఉండటంతో అధికంగా యూరియాను వాడుతున్నట్లు రైతులు పేర్కొన్నారు.

గతంలో బయట మార్కెట్ కంటే తక్కువ ధరలకు ఎరువులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఆర్‌బీకే ద్వారా బయట మార్కెట్ కంటే తక్కువ ధరలకు అన్నదాతలకు ఎరువులు అందించేవారు. రైతులకు కావాల్సిన ఎరువులను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలో కియోస్క్‌లో నమోదు చేసుకుని అవకాశం ఉండేది. నమోదు చేసుకున్న ఒకట్రెండురోజుల్లోనే ఎరువులు రైతులకు అందేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కియోస్క్ మిషన్లు మూలన పడేసిన సంగతి తెలిసిందే. రైతు భరోసా, కేంద్రం పేరు మార్చేసిన కూటమి సర్కార్ సేవలను పూర్తిగా తగ్గించిందని రైతులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలలో ఎరువులను ఎప్పుడు అందుబాటులో ఉండవని, ఒకవేళ పేర్లు నమోదు చేసుకున్నా ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు..

రైతులపై మోయలేని భారం



నాకు ఉన్న పొలంలో బుడ్డ సెనగ, వేరుశనగ, తదితర పంటలు సాగు చేశా. రైతులు వాతావరణ ప్రతికూల పరిస్థితుల మధ్య కొట్టుమిట్టాడుతున్న తరుణంలో కంపెనీలు ఇష్టానుసారంగా ఎరువుల ధరలను పెంచుతున్నాయి. రైతులపై మోయలేని భారం పడుతోంది. కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను నియంత్రించాలి. అప్పుడే పంటల సాగు ముందుకు సాగుతుంది. – శేఖర్‌రెడ్డి, రైతు, సింహాద్రిపురం

సబ్సిడీపై ఎరువులను సరఫరా చేయాలి



రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులను సబ్సిడీపై సరఫరా చేయాలి. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసుకునేందుకు పెట్టుబడి పెట్టే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో రైతుల ఇబ్బందులను గుర్తించి రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు సబ్సిడీపై సరఫరా చేయాలి. రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలి. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడిసాయం రూ.20 వేలు వెంటనే మంజూరు చేయాలి. – రవీంద్రనాథరెడ్డి, రైతు, సింహాద్రిపురం

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సబ్‌జైల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేయడానికి వస్తున్న జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్

జమ్మలమడుగు రూరల్ : శిక్ష పడి జైలు జీవితాన్ని అనుభవిస్తున్న పేద ఖైదీలు ఏవరైన ఉంటే ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ తెలిపారు. మంగళవారం ఆయన సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అనంతరం లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యత గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ తప్పు చేసి జైలుకు వచ్చిన వారు బయటకు వెళ్లిన తరువాత వారిలో మార్పు రావాలని ఆయన సూచించి చట్టాల గురించి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

కమలాపురంలో...

కమలాపురం : వివిధ కేసుల్లో రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత న్యాయ సహాయంను సద్వినియోగం చేసుకోవాలని సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కడప ఎస్. బాబాఫక్రుద్దీన్ తెలిపారు. మంగళవారం స్థానిక సబ్‌జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆయన సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన లీగల్ ఎయిడ్ ప్రాధాన్యతను ఖైదీలకు వివరించారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ సిస్టమ్ తదితర వాటిపై ఖైదీలకు అవగాహన కల్పించారు. వారి కేసు, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం కొరకు 15100కు డయల్ చేయాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ గంగాధర్, అడ్వకేట్స్, సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



పొలం పిలుస్తోందిలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : ప్రతి రైతు పంటల సాగుకు ముందు తన భూమిలోని మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం స్థానిక 3, 4వ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది... కార్యక్రమంలో ఆమె క్షేత్ర స్థాయిలో పంట పొలాలను సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు తమ పంట పొలాల్లోని మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. వాటి ఫలితాలను బట్టి ఎరువులను వాడవచ్చన్నారు. ఇలా చేయడం వలన ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అలాగే మినుము, శగన పంటల్లో సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు వాడకం వలన రసం పీల్చే పురుగులు, లద్దె పురుగులు, శనగ పచ్చ పురుగులను నివారించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి ఆరోగ్య వంతమైన పంటలను పండించవచ్చన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే వివిధ ద్రావణాలు, కషాయాల తయారీకి సంబంధించిన కరపత్రాలను రైతులకు అందజేశారు. ప్రతి రైతు ఇ–పంట నమోదు చేసుకోవడంతో పాటు ఇ–కేవైసీ చేసుకోవాలన్నారు. నెలాఖరు వరకు పీఎం ఫసల్ బీమా యోజన పథకం ప్రీమియం అమౌంట్‌ను జమ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏ ఇందిర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లతా కుమారి, రైతులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తాతాజీ

సింహాద్రిపురం : ప్రొద్దుటూరులో నిర్వహించిన ఇంటర్ పాల్‌టెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో ఉమ్మడి కడప జిల్లా స్థాయి క్రీడా పోటీలలో సింహాద్రిపురం ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీలలో భాగంగా డిస్కస్ త్రో, వాలీబాల్, పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు పొందారన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ జగన్‌మోహన్‌రెడ్డి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

నకిలీ ఉల్లి విత్తనాలతో తీవ్రంగా నష్టపోయాం



నకిలీ ఉల్లి విత్తనాలతో తీవ్రంగా నష్టపోయామని పంటను చూపుతున్న రైతన్నలు

పెండ్లిమర్రి : ఇటీవల చాలా మంది రైతులు నాశిరకం, నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోతున్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని రైతన్నలు వేడుకొంటున్నారు. పెండ్లిమర్రి మండలం గొందిపల్లె గ్రామ పంచాయతీలోని బాలయ్యగారిపల్లె గ్రామానికి చెందిన రైతులు గంగిరెడ్డి, రమణారెడ్డి, రామకృష్ణారెడ్డి, మరో ఎనిమిది మంది మైదుకూరులోని న్యూ వీరబ్రహ్మేంద సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్‌లో అక్టోబర్ నెలలో 23 ఎకరాలకు సరిపడ ఉల్లి విత్తనాలు కొనుగోలు చేశారు. విత్తనాలు నాశిరకం, నకిలీ విత్తనాలు కావడంతో పంట ఎదుగుదల లేకపోవడం, మొక్కలు చనిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాలు నకిలీవని డీలర్లను అడిగితే అతను స్పందించడం లేదని రైతులు వాపోయారు. విలేకర్లు రైతుల వద్దకు వెళ్లి పంటలను పరిశీలించి పలు సామాజిక మాధ్యమాల్లో వార్తలు రావడంతో మంగళవారం సాయంత్రం వ్యవసాయాధికారి ఓబులేసు, ఉద్యానశాఖ అధికారి రెడ్డయ్యలు నకిలీ విత్తనాలతో దెబ్బతిన్న ఉల్లి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంట గురించి ఉన్నతాధికారులకు తెలిపామన్నారు. పంటను శాస్త్రవేత్తలు పరిశీలించి నకిలీ విత్తనాలని తేలితే డీలర్‌పై చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.

ఘనంగా కోదండ రామాలయంలో పూజలు



మూలదేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు



ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు, ప్రజలు

లింగాల : మండలంలోని తాతిరెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ప్రాతఃకాల పూజ, మూల, దేవతామూర్తుల జపములు, సుందర కాండ, హనుమద్ చాలీసా పారాయణం, పంచామృత సుగంధ ద్రవ్య పుణ్యానదీజలాది వాస పూజలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా పురోహితులు రామ్‌కుమార్‌శర్మచే నవగ్రహ పూజ, రుద్ర హోమాది నిర్వహించారు. మూలదేవతలు శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజ స్తంభ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

తాతిరెడ్డిపల్లె గ్రామంలోని శ్రీకోదండరామస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా బుధవారం ఉదయం బింబ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ, సర్వదేవతా హోమం, ధ్వజ శిఖర కలశ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, కలశ స్థాపన పూజలు నిర్వహించనున్నారు. అలాగే బుధవారం ఉదయం 9 గంటల నుండి దేశీయ సీనియర్ వృషభరాజములచే బండలాగుడు పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

రైతులు ఇ-పంట నమోదు చేసుకోవాలి



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ రమేష్

లింగాల : సాగు చేసిన ప్రతి పంటకు ఇ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రమేష్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దకుడాల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ. రమేష్ గ్రామంలో జరుగుతున్న ఇ-పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఇ-పంట నమోదులో ఎటువంటి అవకతవకలు లేకుండా ఖచ్చితంగా పంట నమోదు చేయాలని, వ్యవసాయ ఉన్నతాధికారులు తనిఖీ చేస్తారని ఏవైనా వ్యత్యాసాలు కనిపిస్తే వెంటనే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటారన్నారు. పంట నమోదు ఆధారంగానే రైతులకు పంటల బీమా, పంట నష్ట పరిహారం, వడ్డీలేని పంట రుణాలు తదితర పథకాలకు అర్హులవుతారన్నారు. ఇంకా బీమా కట్టుకోని వారు ఉన్నట్లయితే ఈనెల 31వ తేదీలోపు పంటల బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది మౌనిక, రైతులు పాల్గొన్నారు.

నేడు తాతిరెడ్డిపల్లెకు మాజీ సీఎం వైఎస్ జగన్ రాక

లింగాల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం లింగాల మండలం తాతిరెడ్డిపల్లె గ్రామంలో పర్యటించనున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రామాలయ నిర్మాణానికి ఎండోమెంట్ ద్వారా రూ.32 లక్షలు, ప్రజల చందాల ద్వారా రూ.68 లక్షలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ కమిటీ సభ్యులు దేవతామూర్తుల విగ్రహాలను రూ.2.50 లక్షల వ్యయంతో తీసుకొచ్చారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు తాతిరెడ్డిపల్లె గ్రామానికి చేరుకుని ఆలయాన్ని ప్రారంభించి సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ వేడుకలలో పాల్గొంటారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పులివెందుల–పార్నపల్లె ప్రధాన రహదారి నుంచి తాతిరెడ్డిపల్లె క్రాస్ రోడ్డు ద్వారా తాతిరెడ్డిపల్లెకు చేరుకోనున్నారు. గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు భారీగా ఫ్లెక్సీలను, బ్యానర్లను ఏర్పాటు చేశారు.

పరామర్శ



వైఎస్సార్‌సీపీ నాయకుడు కాశీరావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడి

పులివెందుల రూరల్ : ఈనెల 12వ తేదీన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాశీరావు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లతో కలిసి జెండామాను వీధిలో ఉన్న మృతుడి నివాసానికి వెళ్లి కాశీరావు చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే సినిమా థియేటర్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్న మూర్తిరావు కూడా మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా.. వారి కుటుంబ సభ్యులను ఎంపీ పరామర్శించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, కార్యకర్తలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో సమస్యల వెల్లువ



రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

చింతకొమ్మదిన్నె : స్థానిక గ్రామ సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు అత్యధిక మంది ప్రజలు హాజరై ఆర్ఓఆర్‌కు సంబంధించి 56 అర్జీలు, సర్వే సమస్యలపై 20 అర్జీలు, అడంగల్ కరెక్షన్‌కి సంబంధించి 28 అర్జీలు కలిసి అత్యధికంగా 84 అర్జీలు భూమి సమస్యలపై వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె తహసీల్దార్ నాగేశ్వరరావు, ఆర్ఐ ఆదిరాజు, మండల సర్వేయర్ నాగభూషణంరెడ్డి, దేవాదాయ శాఖ ఏవో రవిశేఖర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : మండలంలోని రుద్రభారతి పేటలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీసల్దార్ సరస్వతి పాల్గొని మాట్లాడారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను 45 రోజులలోగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పరిమళ, ఆర్ఐ కౌశిక్, సర్వేయర్ సోమశేఖర్, విలేజ్ సర్వేలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చిలు



పులివెందులలో క్రిస్మస్ పండుగకు ముస్తాబైన బేతేలు చర్చి



పులివెందులలో విద్యుత్ కాంతులతో సుందరంగా తీర్చిదిద్దిన సీఎస్ఐ చర్చి

పులివెందుల రూరల్ : నేడు క్రిస్మస్ పండుగ సందర్భంగా పట్టణంలో సీఎస్ఐ చర్చి, బేతేలు చర్చి, తదితర ప్రార్థనా మందిరాలను సుందరంగా తీర్చిదిద్దారు. పండుగ రోజున పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు ముమ్మరంగా చేస్తున్నారు. చర్చి పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. క్రిస్మస్ పండుగ రోజున కులమతాలకతీతంగా ప్రజలు పాల్గొని ప్రార్థనలు చేయడం ఆనవాయితీగా మారింది. సీఎస్ఐ చర్చిలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతిరెడ్డి, ఆయన తల్లి వైఎస్ విజయమ్మ, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొని ప్రత్యేక ప్రార్థన నిర్వహించనున్నారు.

కమలాపురంలో..

కమలాపురం : మండలంలోని వివిధ గ్రామాల్లో వెల సిన చర్చిలు క్రిస్మస్ శోభను సంతరించుకున్నాయి. మంగళవారం రాత్రి పట్టణంలోని నిస్సీ, సీఎస్ఐ, ఆ ర్‌సీఎం, టీసీసీ, రహెబోతు, మన్నా, హోసన్నా, షిలో హు, యోరూషలేము చర్చిలతో పాటు రామచంద్రాపురం, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, గంగవరం, చదిపిరాళ్ల, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు తదితర గ్రామాలలోని చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. క్రైస్తవులు రాత్రి క్యాండిల్స్ చేతబట్టి పుర వీధుల గుండా క్యారల్స్ నిర్వహించి ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆర్‌సీఎం చర్చిలో బాల యేసు ఉన్న పూరిపాక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

లింగాలలో..

లింగాల : మండలంలో క్రిస్మస్ వేడుకలను బుధవారం నిర్వహించేందుకు క్రైస్తవులు చర్చిలను సర్వం సిద్ధం చేశారు. మండలంలోని లింగాల, బోనాల, చిన్నకుడాల, ఇప్పట్ల, పెద్దకుడాల, పార్నపల్లె, కోమన్నూతల తదితర గ్రామాల్లో క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : వీరపునాయునిపల్లె, అనిమెల, ఉరుటూరు, గంగిరెడ్డిపల్లె, పాయసంపల్లె తదితర గ్రామాల్లోని క్రైస్తవ ఆలయాలను అత్యంత సుందరంగా అలంకరించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలోని అన్ని చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. నేటి ఉదయం ప్రార్థనలతో క్రిస్మస్ వేడుకలను ప్రారంభించనున్నట్లు చర్చి నిర్వాహకులు తెలిపారు. సీఎస్ఐ, ఎస్పీజీ చర్చిలతో పాటు ఇతర చర్చిలు పండుగ శోభతో కలకలలాడుతున్నాయి.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని వల్లూరు, పైడికాలువ, బాలుగారిపల్లె, ఏ ఓబాయపల్లె, మిట్టపల్లె, గణేష్‌పురం, నల్లపురెడ్డిపల్లె, కుమారునిపల్లె, అంబవరం, థెరిసా నగర్, తోల్లగంగనపల్లె, కొప్పోలు, పాపాగ్ని నగర్, లేబాక, కోట్లూరు తదితర గ్రామాలలో చర్చిలను అందంగా అలంకరించి, పశువుల పాక మొదలైన వాటి కోసం ఏర్పాట్లను చేశారు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం సామూహిక ప్రార్థనలు చేయడానికి వీలుగా మందిరాలలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు శాంతా క్లాస్‌ను ఏర్పాటు చేసి వైభవంగా క్రిస్మస్ ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థులను వివిధ వేషధారణలలో అలంకరించి తమ ప్రత్యేకతను ప్రదర్శించారు.



కమలాపురంలో చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన బాలయేసు పూరిపాక



వల్లూరు : విద్యుత్ దీపాల అలంకరణలో ఆర్‌సీఎమ్ చర్చి



వేంపల్లెలో శాంతా తాత వేషధారణల చిన్నారులతో కరస్పాండెంట్, తదితరులు